క్లుప్తంగా

పెద్దమ్మ తల్లికి పూజలు



కూరగాయల అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న పెద్దమ్మ తల్లి

చాపాడు : మండల పరిధిలోని రాజువారిపేట గ్రామంలో ఆదివారం పెద్దమ్మ తల్లికి గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ మాసం మొదలైన సందర్భంగా మొదటి ఆదివారం గ్రామంలోని పెద్దమ్మ తల్లిని అర్చకులు కూరగాయలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఏడాది పొడవునా గ్రామం పాడి పంటలతో తులతూగాలని గ్రామస్తులు వేడుకుంటూ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గాజుల అలంకారంలో ..



గాజుల అలంకారంలో పెద్దమ్మ తల్లి

ప్రొద్దుటూరు : గోపవరం పంచాయతీలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీపెద్దమ్మ తల్లి ఆలయంలో ఆషాడ మాసం రెండో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా గాజులతో అలంకరించారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా గ్రామోత్సవం



గ్రామోత్సవంలో సాయిబాబా

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని దొరసానిపల్లె ఉన్న సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలో భాగంగా ఆదివారం సాయినాథుని గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. వేకువజామున సాయినాథునికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేకంగా రూపొందించిన రథంపై బాబా ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి పురవీధుల్లో సాయినామ కీర్తనలు, డప్పు వాయిద్యాల మధ్య ఘనంగా ఊరేగించారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు.

4న ఉచిత వైద్య శిబిరం

మైదుకూరు : పట్టణంలోని ఎస్ఎల్ఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈనెల 4న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి డాక్టర్ మూలే రామ అనిల్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బద్వేలు రోడ్డులోని ఎస్ఎల్ఆర్ ఆస్పత్రిలో 4వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ-ఎకో తదితర పరీక్షలను ఉచితంగా చేస్తామని వివరించారు.

వైద్యవృత్తిలో కొనసాగడం అదృష్టంగా భావించాలి

ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : ప్రపంచంలో ఏ వృత్తికి దక్కని గౌరవం ఒక్క వైద్యవృత్తికి మాత్రమే దక్కిందని, అలాంటి పవిత్రమైన వైద్యవృత్తిలో కొనసాగడం ప్రతి వైద్యుడు అదృష్టంగా భావించాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) బద్వేలు శాఖ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రపంచాన్ని వణికించిన కరోనా సమయంలో వైద్యులు, వైద్య సిబ్బంది తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కరోనా రోగులకు అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, కార్యదర్శి డాక్టర్ ఫణిధర్‌లు మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటిసారిగా 2008లో దివంగత మహానేత వైద్యుల రక్షణ చట్టం తీసుకువచ్చారని గుర్తుచేశారు. అనంతరం బద్వేలుశాఖ ఐఎంఏ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షుడిగా డాక్టర్ మీనాక్షిరెడ్డి, సెక్రటరీగా డాక్టర్ వాసుదేవరెడ్డి, ట్రెజరర్‌గా డాక్టర్ దినేష్‌లు ఎన్నికయ్యారు. అనంతరం సీనియర్ వైద్యులు డాక్టర్ మీనాక్షిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షులు శ్రీహరిరావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ వి.గోపాలకృష్ణ, ఫైనాన్స్ సెక్రటరీ డాక్టర్ రవీంద్రనాథ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి, సీనియర్ వైద్యులు డాక్టర్ రాంప్రతాప్‌రెడ్డి, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల వైద్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ సుధను సన్మానిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

డాక్టర్లకు సన్మానం

ప్రొద్దుటూరు : స్థానిక రోటరీ క్లబ్‌లో డాక్టర్స్ డేను పురస్కరించుకుని ఆదివారం పట్టణానికి చెందిన ప్రముఖ డాక్టర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో డాక్టర్లు పేదలకు విశేష సేవలు అందించారని తెలిపారు. వారి సేవలను ఎప్పటికీ మరవలేమన్నారు. ప్రముఖ డాక్టర్లు డి.నాగదస్తగిరిరెడ్డి, టీడీ వరుణ్ కుమార్‌రెడ్డి, ఎం.అక్షిత్‌లకు శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి గజ్జల వెంకటేశ్వరరెడ్డి, రోటరీ ట్రస్టు అధ్యక్షుడు కోటా శివకుమార్, పీడీజీ ప్రభ, జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్లను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

శ్రీనివాసనగర్‌లో పోలీసుల తనిఖీలు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో ఆదివారం పోలీసులు కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. అనుమానిత ఇళ్లలోను, ఖాళీ స్థలాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. వాహనాల రికార్డులను పరిశీలించారు.

ఎమ్మెల్యే రాచమల్లుకు సన్మానం

ప్రొద్దుటూరు : మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన వలంటీర్ షేక్ మెహరాజ్ కుటుంబీకులు ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి 26వ వార్డు కౌన్సిలర్ రాచమల్లు రమాదేవిని సన్మానించారు. గృహసారథిగా ఉన్న వలంటీర్ భర్త దస్తగిరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వలంటీర్ కుటుంబానికి ప్రమాదం జరిగిన వెంటనే రూ.2లక్షలు అందించగా, మళ్లీ ముగ్గురు పిల్లలు చదువుకునేందుకు రూ.9.33 లక్షలను పూజా స్కూల్ యాజమాన్యానికి చెల్లించారు. అలాగే 5వ తరగతి చదువుతున్న కుమార్తె వివాహం వయసుకు వచ్చేలా రూ.10లక్షలు విలువైన బాండ్‌ను ఎమ్మెల్యే అందించారు. ఇందుకు కృతజ్ఞతగా వలంటీర్ కుటుంబీకులు ఆదివారం ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి సన్మానించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బండి ఆత్మాకూరు సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, గ్రామానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న మెహరాజ్

జగనన్న సురక్ష కార్యక్రమానికి అనూహ్య స్పందన

గోపవరం : ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని ఆ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. గోపవరం సచివాలయం పరిధిలో 1080 ఇళ్లను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు ఇంటింటి సర్వే నిర్వహించారు. మొదటి విడతగా 266 వివిధ రకాల ధృవీకరణపత్రాలను లబ్ధిదారులకు ఉచితంగా అందజేశారు. అత్యధికంగా కుల, ఆదాయ ధృవీకరణపత్రాలు ఉన్నాయి. ప్రజలకు అవసరమైన ధృవీకరణ పత్రాలను ఎలాంటి సర్వీసు లేకుండా ఉచితంగా అందజేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగనన్న సురక్ష ఇంటింటి సర్వేను మండల ప్రత్యేకాధికారి నాగరాజ, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినారాయణలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు సూచనలు ఇవ్వడం జరిగింది. 1080 ఇళ్లలో సర్వే నిర్వహించగా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని ఒక్క కుటుంబం కూడా లేకపోవడం గమనార్హం. ఇదే విషయంపై జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులు, సచివాలయ సిబ్బందిని అభినందించారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, అధికారులకు కూడా సహకరించాలన్నారు.



గోపవరంలో లబ్ధిదారులకు ధృవీకరణపత్రాలను అందజేస్తున్న అధికారులు

సాహిత్య కృషీవలుడు డీకే చదువుల బాబు

ప్రొద్దుటూరు కల్చరల్ : సాహిత్య కృషీవలుడు డీకే చదువుల బాబు అని చైతన్య సాహిత్య కళావేదిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, కవి కాశీవరపు వెంకటసుబ్బయ్య తెలిపారు. స్థానిక చైతన్య సాహిత్య కళావేదిక కార్యాయలంలో ఆదివారం కేంద్ర సాహిత్య ఆకాడమి అవార్డుకు ఎంపికైన డీకే చదువుల బాబును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాశీవరపు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా చదువుల బాబు ఎన్నో రచనలు చేశారని కొనియాడారు. బాలల కోసం ప్రముఖ పత్రికల్లో వందల సంఖ్యలో రచనలు చేయడంతోపాటు 21 పుస్తకాలను ప్రచురించారన్నారు. ఆయనకు కేంద్ర సాహిత్య అవార్డు లభించడం సంతోషంగా ఉందన్నారు. కవులు కామనూరు రామమోహన్, గజ్జల వెంకటేశ్వరరెడ్డి, పల్లా కృష్ణ, పల్లా రామారావు, కంభం పాములేటి, పెద్దయ్య, ప్రతాప్, నరసింహ పాల్గొన్నారు.



డీకే చదువులబాబును సత్కరిస్తున్న కవులు, రచయితలు

నేడు బద్రిపల్లెలో జగనన్న సురక్ష

చాపాడు : మండల పరిధిలోని బద్రిపల్లె గ్రామ సచివాలయం వద్ద సోమవారం జగనన్న గ్రామ సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ మండల అభివృద్ధి అధికారి రాధాకృష్ణవేణి తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగనున్న గ్రామ సభలో గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని రకాలైన ధృవీకరణ పత్రాలను అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలందరూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

రేపు గంగనపల్లెలో..

కాశినాయన : మండలంలోని గంగన్నపల్లె సచివాలయంలో మంగళవారం ఉదయం 9:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మైథిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 24వ తేదీ నుండి నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లను ఇంటింటి సర్వేలో గుర్తించడం జరిగిందని, ఈ మేరకు వారందరికీ ఉచితంగా 11 రకాల సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు తెలిపారు. సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే రాక

కలసపాడు : మండలంలోని ఎగువ తంబళ్లపల్లె గ్రామ సచివాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు జరిగే జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు హాజరవుతున్నట్లు ఎంపీడీఓ మహబూబ్‌బీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్లను ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల చేతులమీదుగా అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

ఆంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా సత్యనారాయణ



ప్రొద్దుటూరు : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీఆంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా సత్యనారాయణ జ్యువెలర్స్ యజమాని కేవీఎస్ సత్యనారాయణ నియమించారు. ఆలయ పాలకమండలి సభ్యులుగా సుంకు కిశోర్ బాబు, పీవీ జగదీష్, బి.సంగీత, కె.నాగరత్నమ్మ, కె.మాబున్ని నియమించారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద వీరి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న సునీల్

మైదుకూరు : సోహిత్ మృతికి కారణమైన బీరం విద్యాసంస్థల యజమాని బీరం శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గండి సునీల్ డిమాండ్ చేశారు. మైదుకూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థి అనుమానాస్పదంగా మృతికి కారణమైన విద్యాసంస్థల యజమానిని అరెస్టు చేయాలన్నారు. విద్యాసంస్థల గుర్తింపును శాశ్వతంగా రద్దు చేయాలని, విద్యార్థి కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను వారి తల్లిదండ్రులకు ఇష్టమైన పాఠశాల, కాలేజీలో చేరే విధంగా జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అజయ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : బీరం విద్యాసంస్థల అధినేతపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్ఓ రాయలసీమ కన్వీనర్ ఓబులేసు ఓ ప్రకటనలో కోరారు. చనిపోయిన విద్యార్థి సోహిత్ కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పోరుమామిళ్ల : ఖాజీపేట మండలం కొత్తనెల్లూరు దగ్గర బీరం శ్రీధర్‌రెడ్డి విద్యాసంస్థలో చదువుతున్న 6వ తరగతి విద్యార్థి సోహెల్ మృతికి కారణమైన యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబానికి రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వస్తువులను పంపిణీ చేయాలి

రాజుపాళెం : హాస్టల్‌లో చదివే విద్యార్థులకు ప్రతి ఏడాది అందించే ట్రంకు పెట్టెలు, బెడ్ సీట్లు, ప్లేట్లు, గ్లాసులు తక్షణమే పంపిణీ చేయాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. రాజుపాళెంలోని ఎస్సీ హాస్టల్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు కాట్స్ ఏర్పాటు చేసి సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌ను మరింత మెరుగు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మెస్ చార్జీలు ఒక్కొక్క విద్యార్థికి రూ. 3 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాస్మోటిక్ చార్జీలు పెండింగ్ లేకుండా ప్రతి నెలా విడుదల చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. హాస్టల్స్‌ను నాడు-నేడులో చేర్చి అభివృద్ధిని చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న సగిలేరు

కలసపాడు : స్థానిక గిద్దలూరు రోడ్డులోని సగిలేరు బ్రిడ్జి వద్ద సగిలేరులోని నీరు కలుషితమై కంపు కొడుతుంది. చికెన్ సెంటర్ యజమానులు తమ షాపులోని వ్యర్థాలను సగిలేరులో పడేయడంతో వ్యర్థాలతో నీరు కలుషితమై కంపుకొడుతుంది. ఒకప్పుడు బర్రెలు, మేకలు, గొర్రెలకు అక్కడ నీటిని తాపేవారు. ఇప్పుడు వ్యర్థాలు వేయడంతో జీవాలకు నీటిని ఇంటి వద్దనే తాపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే సగిలేరు వద్ద ఉన్న చుట్టు పక్కల ఇళ్ల యజమానులు కంపును భరించలేకపోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సగిలేరులో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సగిలేరులో వ్యర్థాలతో కలుషితమైన నీరు

6 నుంచి సదరం స్లాట్ బుకింగ్ చేసుకోండి

ప్రొద్దుటూరు : దివ్యాంగులు వైకల్య ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు ఈనెల 6 నుంచి సదరం స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చునని ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిసా సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుసేన్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో బుకింగ్ చేసుకోవడానికి స్లాట్లు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దివ్యాంగులు తమ సమీపంలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయంలో లేదా మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. దివ్యాంగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సదరం సర్టిఫికెట్లను పొందాలని కోరారు.

కుట్టు మిషన్లు పంపిణీ



కుట్టుమిషన్లు అందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు : వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు ఆదివారం చేతన ఫౌండేషన్ సహకారంతో కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. వికసిత ఫౌండేషన్ కుట్టుమిషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ సభ్యుడు దొడ్డ సీతారామయ్య మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధిలో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో దండపాణి శ్రీనివాసకుమార్, నెహ్రూ యువకేంద్రం అధికారి మణికంఠ, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు చిప్పగిరి ప్రసాద్, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మిదేవి, సురేష్, చంద్ర, నవీన్, రషీద్, మస్తాన్ పాల్గొన్నారు.

క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించిన సీఐ



గాయపడిన వ్యక్తిని ఆటోలో ఆస్పత్రికి తరలిస్తున్న సీఐ ఇబ్రహీం

ప్రొద్దుటూరు క్రైం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ప్రొద్దుటూరు టూటౌన్ సీఐ ఇబ్రహీం ఆస్పత్రికి తరలించారు. మైదుకూరుకు చెందిన మహమ్మద్ ఆదివారం బైక్‌లో ప్రొద్దుటూరుకు వచ్చాడు. ఈ క్రమంలో శివాలయం సెంటర్‌లో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొనడంతో అతను తీవ్రంగా గాయ పడ్డాడు. కాలు విరగడంతో నడవలేక రోడ్డుపై పడిపోయాడు. విషయం తెలుసుకున్న సీఐ ఇబ్రహీం సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని ఆటోలో జిల్లా ఆస్పత్రికి పంపించి అతనికి మెరుగైన వైద్యం అందించేలా చొరవ తీసుకున్నారు.